క్లుప్తంగా

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రోత్సాహం


సాయి కిరణ్

కొవ్వూరు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులను పొత్రహిస్తున్నట్టు కొవ్వూరు సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయి కిరణ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాధారణ కాన్పు తర్వత రెండు, మూడు రోజుల ఆసుపత్రిలో ఉంటే సరిపోతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించాలన్నారు. నవ జాత శిశువుకి ఇచ్చే తల్లిపాల నిరోధక శక్తి అధికంగా ఉంటుం దన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిజేరియన్ కాన్పుల కంటే సాధారణ ప్రసవంతోనే తల్లి త్వరగా కొలుకుంటుందన్నారు. సామాజిక ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాల్సి ఉంటుందన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

పెరవలి: కాపవరంలో పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్నారని సమాచారం రావటంతో తమ సిబ్బందితో ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు వెళ్లి దాడి చేశారు. జూదరులు పారిపోకుండా డ్రోన్ సాయంతో పట్టుకున్నామన్నారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ.4వేలను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి తలారి పరామర్శ


తాడిపూడిలో సోమాలమ్మ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: తాడిపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు న్యాయవాది గోతం మల్లికార్జునరావు తల్లి గౌతమ్ సోమాలమ్మ ఇటీవల మృతి చెందింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం సోమాలమ్మ కుటుంబ సభ్యులను కలిసి తన సంతాపం తెలియజేశారు. ఆమె చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, నాయకులు మండిగ గిరి, గండి రాంబాబు, దాకే రాజు, కవల నాగేశ్వరరావు, గుంటు చిన్నబ్బాయి తదితరులున్నారు.

కోడిపందాలపై దాడి

నల్లజర్ల: ముసుళ్లగుంట అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందాలపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,640, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నిడదదవోలు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని కల్యాణ మండపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 50 మంది పేదలకు దుప్పట్లు, వివిధ రంగాల కార్మికులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యాక్షుడు చామంతి భీమేశ్వరరావు, బలిగేపల్లి సూర్యనారాయణ, మాధవరపు సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో రాజీవ్ కాలనీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచారు. బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాజు, పోణంగి పవన్, తురగా విజయ భాస్కర్, యర్ర సుధాకర్, రాణా ప్రతాప్,బొందూ కొవ్వూరయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక బస్టాండ్ వద్ద బీజేపీ పతాకాన్ని ఆ పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఓరుగంటి వెంకటపతిరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పాదరక్షల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులు, నిరాశ్రయులను ఆదుకోవడంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ప్రశంసనీయమైన సేవలు అందిస్తోందని జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు సతీష్ ప్రయాగ అన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాదరక్షల పంపిణీలో సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది వృద్ధులకు 20వేల రూపాయల విలువైన పాదరక్షలను శ్రీకర్, సతీష్ చేతుల మీదుగా అందించారు.


వేగేశ్వరంలో సీతారాముల అలంకరణలో పూజలో కూర్చున్న చిన్నారులు


ఊనగట్ల కోదండ రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు


వెలగదుర్రులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రమణీయం.. రాములోరి కల్యాణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


నిడదవోలు పట్టణంలోని రాయిపేట కోదండ రామాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సీతారామస్వామి


కానూరులో సీతారాములను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు


నల్లజర్ల శ్రీరామకృష్ణ భక్త మందిరంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ హోం మంత్రి వనిత

నిడదవోలు: శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. పట్టణంలో అన్ని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. యాదవుల వీధిలో ఉన్న సీతారామ ఆలయం వద్ద 25వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణలల మధ్య శ్రీరామచంద్రమూర్తి, సీతామహాలక్ష్మి అమ్మ వార్ల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బెల్లం పానకం, వడపప్పు ప్రసాద వితరణ చేశారు. పట్టణ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి కల్యాణాన్ని కనులారా తిలకించారు. బ్రహ్మర్షి ధూళిపాళ ప్రభాకర్ కృష్ణమూర్తి ప్రత్యేక ప్రవచనాన్ని భక్తులకు అందించారు. రాయిపేట శ్రీకోదండ రాయాలయంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇక్కడ ఉత్సవ విగ్రహాలకు గొన్నాభక్తుల శ్రీనివాస్ దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఆలయ ధర్మకర్త గొన్నాభక్తుల రామారావు, సిద్ధాంతి సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

ఉండ్రాజవరం: వెలగదుర్రులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండలంలో తాడిపర్రు, పసలపూడి, వేలివెన్ను, వెలగదుర్రు, చిలకపాడు, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో పండితుల వేద మంత్రాల నడుమ రాములోరి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. చివటం, తాడిపర్రు, వెలగదుర్రు, చిలకపాడు, ఉండ్రాజవరం గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు.

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణం అనంతరం గ్రామ పురవీధుల్లో సీతారాముల విగ్రహాలను పల్లకీలో, రథంపై ఊరేగించారు. కాకరపర్రు, తీపర్రు గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. కానూరులో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక మెయిన్‌రోడ్డులోని రామాలయాలలో స్వామివారి కల్యాణ వేడుకలు వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నెలటూరు సీతారామస్వామి ఆలయంలోను, కోడూరివారి రామాలయంలోను స్వామివారి కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెం రామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాలను నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం చేపట్టారు. కలవలపల్లి, ఊనగట్ల, నందిగంపాడు, చిక్కాల, దారవరం,చంద్రవరం గ్రామాల్లో స్వామివారి శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

నిడదవోలు రూరల్: శ్రీరామనవమి వేడుకలు మండలంలో కనులపండువగా నిర్వహించారు. ఉనకరమిల్లిలో సీతారామస్వామిని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, నాయకులు తిరుమలశెట్టి అయ్యప్ప పాల్గొన్నారు. తాళ్లపాలెంలో రామాలయాలో పసుపు, కుంకుమ పూజలు, సామూహిక కల్యాణం నిర్వహించారు. సమిశ్రగూడెంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గీతామందిరం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. సింగవరం, జీడిగుంట గ్రామాల్లోని వేడుకలు జరిగాయి

కొవ్వూరు: శ్రీరామనవమి వేడుకలు పట్టణంలో యనాదకాలనీ, రౌండ్ రామాలయం, మొక్కల చింతల రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లోను రామాలయాల్లో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

తాళ్లపూడి: శ్రీరామ నవమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలోని పద్మశాలీల రామాలయం వద్ద, వడ్డీల రామాలయం, మధనగోపాలస్వామి ఆలయం, శివాలయంలోను, అనంతం వారి వీధిలో సాయిబాబా ఆలయం వద్ద, మైగాపుల వారి వీధిలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేగేశ్వరపురంలోని శ్రీరామ్‌నగర్‌లోని పట్టాభిషేక రామాలయం వద్ద టీటీడీ ధర్మ ప్రచార సభ్యులు పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అదేవిదంగా పెద్ద రామాలయంవద్ద, మేదర్ల పేట, వడ్డీల రామాలయాల వద్ద నవమి వేడుకలు నిర్వహించారు. పోచవరం, పెద్దేవం, తాడిపూడి, మలకపల్లి, తిరుగుడుమెట్ట, అన్నదేవరపేట, తుపాకులగూడెం, రాగోలపల్లి, రావూరుపాడు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

దేవరపల్లి: మండల గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి రాముని కల్యాణ మూహూర్తానికి పలు గ్రామాల్లో స్వామి వారి కల్యాణం జరిపించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ ఉత్సవాలు జరిగాయి. స్వామి వారి కల్యాణానికి భక్తులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. దేవరపల్లి మెరక వీధిలోని కోదండ రామాలయంలో నిర్వహించిన కల్యాణ వేడుకల సందర్భంగా స్థానిక షిర్డీ సాయి మందిరం ద్వారా సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. వీటిని మందిర కమిటీ సభ్యులు ఊరేగింపుగా తీసుకువచ్చి పండితులకు అందజేశారు. అనంతరం సీతాదేవిని పెండ్లి కుమార్తెగా, శ్రీరాముడిని పెండ్లి కుమారునిగా అలంకరించి, స్థానిక సుబ్రహమణ్యేశ్వర స్వామి ఆలయ పురోహితులు అఖండ వంశీ కల్యాణ క్రతువు జరిపించారు. పలువురు భక్తులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక పల్లపు వీధి రామాలయం వద్ద కోదండ రాముని ఆలయంలో స్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించారు, బందపురంలోని కోదండ రామాలయం, దుద్దుకూరులో సీతారామచంద్ర స్వామి ఆలయం, గౌరీపట్నం, లక్ష్మీపురం, యర్నగూడెం, పల్లంట్ల, త్యాజంపూడి, సంగాయగూడెం, చిన్నాయగూడెం, యాదవోలు తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నల్లజర్ల: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా నల్లజర్ల శ్రీరామకృష్ణ భక్త మందిరం వద్ద జరిగిన కల్యాణోత్సవంలో వైఎస్సార్ సీపీ గోపాలపుర నియోజకవర్గ కో ఆర్డినేటర్, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ హోం మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు సామవేదం నరేష్, ఆంజనేయశర్మ ఆధ్వర్యాన కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం దంపతులు పూజాదికాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు, పండ్లు, పుష్పాలు సమర్పించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, పులిహోర, సేమ్యా కేసరి, అరటిపండ్లు అందజేశారు. నాయకులు బంక అప్పారావు, మేణ్ణి యువరాజు, ముప్పిడి వెంకటరత్నంతోపాటు భక్తులు పాల్గొని, కల్యాణోత్సవాన్ని ఆద్యంతం వీక్షించారు. అనంతపల్లి,దూబచర్ల, ప్రకాశరావుపాలెం, ఆవపాడు, సింగరాజుపాలెం గ్రామాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.


వేగేశ్వరంలో విశేష అలంకరణలో ఉన్న స్వామివారు


తీపర్రులో భారీ అన్న సమారాధన


అన్నవరప్పాడులో సీతారాములను రథంపై ఊరేగిస్తున్న భక్తులు


బ్రాహ్మణగూడెం రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి

కొత్త పింఛన్ల మంజూరు ఏదీ?


కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ పెరవలిలో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పెరవలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారుగా ఏడాది అవుతున్నా కొత్త పింఛన్లు మంజూరు ఉత్తర్వులు ఇప్పటి వరకూ ఇవ్వలేదని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. పెరవలిలో జాతీయ రహదారి పక్కన బీఎస్పీ నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ఏలూరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన పింఛన్లు నేటికీ ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లకు ఉత్తర్వులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన పింఛన్లను అనర్హత పేరుతో తొలగించారని, కనీసం వాటి స్థానంలో అయినా కొత్తవి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్రా రాజు, నల్లి రమేష్, చల్లా బత్తుల సత్యనారాయణ, వెన్నపు సుధాకర్, బద్దా జాన్, గూడపాటి వెంకటేశ్వర్లు, గొల్ల రాజు, కప్పల ఇజ్రాయిల్, చిగురుపాటి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం


వేళ్లచింతలగూడెం శివార్లలో నేలకొరిగిన చెట్టు


పైడిమెట్ట గజ్జరం ఆర్అండ్‌బీ రోడ్డుపై నేలకూలిన చెట్టు


కరగపాడులో రాలిన మామిడికాయలు ఏరుతున్న రైతు

- నేలకొరిగిన చెట్లు
- రాలిన మామిడి, జీడిమామిడి కాయలు

గోపాలపురం: గాలివాన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలి, వర్షానికి మండలంలోని మామిడి, జీడిమామిడి కాయలు రాలిపోయాయి. అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. రోడ్ల వెంబడి చెట్లు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గోపాలపురం మండలంలోని కరగపాడు, బుచ్చియ్యపాలెం, దొండపూడి, హుకుంపేట గ్రామాల్లో ఉన్న సుమారు 200 ఎకరాల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. మరో పది రోజుల్లో మామిడి కాయలు కోయడానికి సిద్ధంగా ఉన్నాయని చేతికి అందివచ్చిన పంట నేలపాలైయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాదాలకుంట, వెదుళ్లకుంట, కోమటికుంట గ్రామాల్లో జీడిమామిడి కాయలు, పిందెలు రాలిపోయాయి. చిట్యాల, కరగపాడు, వెంకటాయపాలెం గ్రామాల్లో ఉన్న మొక్కజొన్న పంట నేలకొరిగినట్లు రైతులు తెలిపారు. ఈదురుగాలులకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు కొమ్మలు విరిగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు 10 విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ నిలుపుదల చేశారు. దీంతో ఇంట్లో ఉన్న చిన్నారులు, వృద్ధులు నానాఅవస్థలు పడ్డారు.

ఈదురు గాలులకు నేలకూలిన చింత చెట్టు

తాళ్లపూడి: మండలంలో ఆదివారం సాయంత్రం వాతావరణంలో మార్పులు వచ్చి బలమైన ఈదురు గాలులు వీయడంతో పైడిమెట్ట గజ్జరం రోడ్డులోని భారీ చింత చెట్టు కూలింది. ఏళ్ల నాటి చింత చెట్టు ఆర్అండ్‌బీ రోడ్డు పై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. అలాగే పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొద్దిపాటి చినుకులు పడడంతో రైతులు ధాన్యంపై బరకాలు కప్పి ఉంచారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com